జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
## మహబూబ్‌నగర్
నాగర్ కర్నూల్, వనపర్తి
జోగులాంబ గద్వాల
నారాయణపేట
శనివారం సెప్టెంబర్ 19, 2026 పేజీలు:15



02లో

## జిల్లా కిసాన్ మేళాకు రైతులు అధికసంఖ్యలో పాల్గొనాలి

- జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్




## సాలార్ నగర్ భూభారతి సర్వేపై రైతుల ఆగ్రహం

13లో

భూభారతి పైలట్ ప్రాజెక్టు.. సమస్యలకు 'సర్వే'తోనే ముగింపు?

సర్వే చేశారు.. డ్రోన్ ఎగరేశారు.. ఎల్పీ నంబర్లు ఇచ్చారు.. కానీ రైతుల భూ సమస్యలు మాత్రం తీరలేదు!

రీ-సర్వే చేసి ప్రతి సమస్యను గ్రామంలోనే పరిష్కరించాలి: సాలార్ నగర్ రైతుల డిమాండ్

# జిల్లా కిసాన్ మేళాకు రైతులు అధికసంఖ్యలో పాల్గొనాలి - జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్

మొదటిపేజీ తరువాయి



**నాగర్ కర్నూల్ : సెప్టెంబర్ 18 (ప్రజా జ్యోతి)**

జిల్లాస్థాయి కిసాన్ మేళాకు రైతులు అధిక సంఖ్య లో హాజరుకావాలి లని,నూతన వ్యవసాయసాంకేతికత,ప్రభుత్వ పథకాలపై అవగాహన పొందాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ అన్నారు.వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) పథకంలో భాగంగా నాగర్ కర్నూల్ జిల్లాస్థాయి కిసాన్ మేళాను శనివారం సెప్టెంబర్ 19న, పాలెం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.కిసాన్ మేళాలో వ్యవసాయ మరియు అనుబంధ శాఖల ఆధ్వర్యంలో వివిధ స్టాల్స్‌ను ఏర్పాటు చేయనున్నామని ఆయా స్టాల్స్‌లో నూతన వ్యవసా య పద్ధతులు,ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం,తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందే సాగు విధానాలు,రైతులకు ఉపయోగకరమైన వ్యవసాయ సాంకేతికతలు, వివిధ ప్రభుత్వ పథకాలపై స మాచారాన్ని ప్రదర్శించనున్నట్లు కలెక్టర్ తెలిపారు.అదేవిధంగా పాలెం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో సాగుచేస్తున్న వివిధ పంటలను రైతులు ప్రత్యక్షంగావీక్షించే అవకాశాన్ని కల్పించి,ఆ యా పంటల సాగులో అవలంబిస్తున్న నూతన పద్ధతులు,ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం గురించి శాస్త్రవేత్తలద్వారా రైతులకు అవగాహన కల్పించను న్నట్లు తెలిపారు. కిసాన్ మేళాలో వివిధ వ్యవసా య,అనుబంధ శాఖల అధికారులు,శాస్త్రవేత్తలు పాల్గొని లాభసాటి వ్యవసాయం,పంటల సాగు విధానాలు,చీడపీడల నివారణ,సమగ్ర పంటల యాజమాన్య పద్ధతులు తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించనున్నట్లు,శాస్త్రవేత్తలు,రైతులమధ్య ముఖాముఖి చర్చా కార్యక్రమాన్ని కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు.రైతులు తమ సమస్యలను నేరుగా శాస్త్రవేత్తల దృష్టికి తీసుకెళ్లి, వాటికి శాస్త్రీయ పరిష్కారాలను తెలుసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. నాగర్ కర్నూల్ జిల్లా లోని రైతులందరూ శనివారం ఉదయం 10:00 గంటల నుంచి పాలెం ఆర్ఆర్ఎస్ ఆడిటోరియంలో నిర్వహించే కిసాన్ మేళాకు అధిక సంఖ్యలో హాజరై,వ్యవసాయ రంగంలో అందుబాటులోకి వస్తున్న నూతన సాంకేతిక పరిజ్ఞానం,ఆధునిక సాగు పద్ధతులు,ప్రభుత్వ పథకాలు,సబ్సిడీలపై అవగాహన పొందాలని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని కిసాన్ మేళాను విజయ వంతం చేయాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ పిలుపునిచ్చారు.

# బెక్కెం గ్రామంలో ఉపాధ్యాయుడికి ఘన సన్మానం

**చిన్నంబావి,సెప్టెంబర్ 18 (ప్రజా జ్యోతి)**


చిన్నంబావి మండల పరిధిలోని బెక్కెం గ్రామంలో ప్రధానోపాధ్యాయుడు రామస్వామిని ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఇటీవల చిన్నంబావి మండల కేంద్రంలోని ఎంఆర్సీ భవనంలో 2024 డీఎస్సీ ద్వారా నూతనంగా నియమితులైన ఉపాధ్యాయులకు, డీఎస్సీ2008 ఉపాధ్యాయులు ఘనంగా సన్మాన కార్యక్రమం సందర్భంగా రామస్వామిని అభినందించారు.ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జి దేవని రమేష్ మాదిగ ఆధ్వర్యంలో గ్రామ కమిటీ సభ్యులు ప్రధానోపాధ్యాయుడు రామస్వామిని శాలువాతో సన్మానించారు. అనంతరం దేవని రమేష్ మాదిగ మాట్లాడుతూ..విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు క్రమశిక్షణ, సామాజిక బాధ్యత, మంచి విలువలను అలవర్చాల్సిన అవసరం ఉందన్నారు. ఉపాధ్యాయుల సేవలను గుర్తించి గౌరవించడం అభినందనీయమని పేర్కొన్నారు.ప్రధానోపాధ్యాయుడు రామస్వామి మాట్లాడుతూ తనను సన్మానించిన ఎమ్మార్పీఎస్ నాయకులు, గ్రామ కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల అభ్యున్నతితో పాటు పాఠశాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని చెప్పారు.ఈ కార్యక్రమంలో చిన్నంబావి మండల అధికార ప్రతినిధి డిఎస్ సహదేవ్ మాదిగ, గ్రామ అధ్యక్షుడు బండారి ఓమేష్ చంద్ర మాదిగ ఏడవ వార్డు సభ్యురాలు డీఎస్ రాణి, ఎంఆర్పీఎస్ గ్రామ ఉపాధ్యక్షుడు జిక్కి నరసింహ మాదిగ, కోశాధికారి నాగపురి రాములు మాదిగ, ప్రధాన కార్యదర్శి నీరడి ఆంజనేయులు మాదిగ, సీనియర్ నాయకుడు బండారి కురుమూర్తి మాదిగ, గ్రామ కమిటీ సభ్యులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# నిమజ్జన ఏర్పాట్లు పటిష్టంగా చేపట్టాలి ఎస్ఐఆర్ -2026 ఓటరు జాబితా సవరణలో తప్పులకు తావివ్వొద్దు: అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 18 ( ప్రజా జ్యోతి బ్యూరో )**

వినాయక నిమజ్జన ఏర్పాట్లు, ఎస్ఐఆర్–2026 ఓటరు జాబితా సవరణ, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపు, మౌలిక వసతుల కల్పనపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి. మధుసూదన్ నాయక్ శుక్రవారం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. వినాయక నిమజ్జనాన్ని ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు శాఖల మధ్య సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు. నిమజ్జన ప్రాంతాల్లో క్రేన్లు, విద్యుత్, జనరేటర్లు, లైటింగ్, నైపుణ్యం కలిగిన ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని సూచించారు. పారిశుధ్య చర్యలు చేపట్టి, నిమజ్జనం అనంతరం వ్యర్థాలను వెంటనే తొలగించాలని ఆదేశించారు. ఎస్ఐఆర్–2026 ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించి, 18 సంవత్సరాలు నిండిన ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పించాలని సూచించారు. ఫారం–6, 7, 8 ద్వారా వచ్చిన దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిశీలించి నిర్ణీత సమయంలో పరిష్కరించాలని, ఓటరు జాబితాలో తప్పులకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను అర్హులైన నిరుపేదలకు పారదర్శకంగా కేటాయించాలని, కాలనీల్లో తాగునీరు, విద్యుత్, రహదారులు, డ్రైనేజీ వంటి మౌలిక వసతులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో హౌసింగ్ పీడీ ఉపేందర్ రెడ్డి, తహశీల్దార్లు, ఎంపీడీఓలు తదితరులు పాల్గొన్నారు.



# బి. ఆర్. ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి ఆదేశాలు ఆలంపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు విజయుడు సూచనలతో!

-అయిజలో కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

- "ఎస్టీలకు అన్యాయం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. ఎరుకలి వర్గానికి న్యాయం చేయాలి!

-ఎస్టీ కులాలకు ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు చేయాలి:

- బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కురువ పల్లయ్య ,

- బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాగర్ దొడ్డి వెంకటరాములు గారు

ఆలంపూర్ సెప్టెంబర్ 18(ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి)

జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గం అయిజ పట్టణ కేంద్రంలో పాత బస్టాండ్ నందు ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి ఆదేశాల మేరకు, ఆలంపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు విజయుడు సూచన మేరకు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, ఎస్టీ ఎరుకలి కుల సంఘ నాయకులతో కలిసి తెలంగాణ రాష్ట్ర మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్వీ నాయకులు కురువ పల్లయ్య , నాగర్ దొడ్డి వెంకటరాములు మరియు ఎరుకలి కుల సంఘ నాయకులు శివ మాట్లాడుతూ.కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. ఎస్టీలకు, ముఖ్యంగా ఎరుకలి వర్గానికి ప్రభుత్వం అన్యాయం చేస్తోందని. అదేవిధంగాబిఆర్ఎస్ పార్టీ ప్రభుత్వ హయాంలో ఎస్టీలకు అనేక సంక్షేమ పథకాలు, విద్యా అవకాశాలు, గురుకులాలు, స్కాలర్‌షిప్‌లు, ఆర్థిక సహాయ కార్యక్రమాలు, స్వయం ఉపాధి అవకాశాలు అందాయి. ఎస్టీల సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదే" అని వారు మాట్లాడారు.

( ఎస్టీ కులాలకు ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు చేయాలి!)

ఎస్టీ వర్గాల్లోని వివిధ కులాల ఆర్థిక, సామాజిక అభివృద్ధి కోసం ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్పొరేషన్ల ద్వారా ఎస్టీ కుటుంబాలకు ఆర్థిక సహాయం, స్వయం ఉపాధి రుణాలు, నైపుణ్య శిక్షణ, విద్యాఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. అలాగేఎరుకలి వర్గానికి ప్రత్యేకంగా ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించాలని, అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలని, ఎరుకలి యువతకు ఉపాధి మరియు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు."ఎరుకలి వర్గానికి న్యాయం జరిగే వరకు మా గొంతు వినిపిస్తూనే ఉంటుంది. ఎస్టీ కులాలకు ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు చేసి ఆర్థికంగా బలోపేతం చేయాలి" అని కురువ పల్లయ్య, నాగర్






దొడ్డి వెంకటరాములు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ తిరుమలేష్ , కో ఆప్షన్ నెంబర్ మౌల , రంగు మద్దిలేటి , బి .ఆర్. ఎస్ పార్టీ నాయకులు అంజి ,బీ.ఆర్.ఎస్ పార్టీ నాయకులు పూడూరు నరసింహులు , మాల నాగరాజు , మాల లక్ష్మన్న ,, కార్యకర్తలు, ఎస్టీ ఎరుకలి కుల సంఘ నాయకులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# పాడైన గుడ్లు.. చిన్నారులకెలా? కేటీదొడ్డిలో అంగన్వాడీ కేంద్రంలో నాణ్యతపై స్థానికుల ఆందోళన

ఆలంపూర్ సెప్టెంబర్ 18(ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి)

జోగులాంబగద్వాల:కేటీదొడ్డి,మండల కేంద్రంలోని ఓ అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు పంపిణీ చేస్తున్న కోడిగుడ్ల నాణ్యతపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాడైపోయినట్లు కనిపిస్తున్న గుడ్లకు సంబంధించిన ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. చిన్నారులకు అందించే ఆహార పదార్థాల్లో ఇలాంటి గుడ్లు ఎలా పంపిణీ చేస్తారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.నిబంధనల ప్రకారం నెలకోసారి అందించాల్సిన కోడిగుడ్లను సుమారు 50 రోజులకు ఒకసారి మాత్రమే ఇస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.గుడ్ల నాణ్యతను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, లోపాలు ఉంటే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.చిన్నారుల ఆరోగ్యానికి సంబంధించిన అంశం కావడంతో అధికారులు తక్షణమే స్పందించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.



# పాత నిర్మాణ సామాగ్రితోనే కొత్త బస్టాండ్ పనులు.. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంపై ప్రయాణికుల ఆగ్రహం

ఆలంపూర్ సెప్టెంబర్ 18(ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి)

జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ బస్టాండ్ నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం విమర్శలకు దారితీస్తోంది. విశాలమైన ప్రాంగణం ఉన్న అయిజ బస్టాండ్‌కు ప్రత్యేక గుర్తింపు ఉన్నప్పటికీ.. ప్రస్తుతం జరుగుతున్న పనుల తీరుపై ప్రయాణికులు, ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.బస్టాండ్ విస్తరణతో పాటు సీసీ పనుల కోసం సుమారు రూ.33 లక్షలతో పనులు చేపట్టారు. అయితే పాత బస్టాండ్‌లో కూల్చివేసిన నిర్మాణ సామాగ్రిని పూర్తిగా తొలగించి, నాణ్యమైన కొత్త సామాగ్రితో పనులు చేపట్టాల్సి ఉండగా.. పాత నిర్మాణ సామాగ్రినే ఉపయోగిస్తూ కొత్త నిర్మాణ పనులు చేపడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.పాత నిర్మాణాలను కూల్చిన తర్వాత వచ్చిన సామాగ్రితోనే కొత్త బస్టాండ్ పనులు చేపట్టడం వల్ల నిర్మాణ నాణ్యతపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రజాధనంతో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించాల్సిన అవసరం ఉందని ప్రయాణికులు, స్థానికులు పేర్కొంటున్నారు. అలాగే రూ.33 లక్షలతో చేపడుతున్న పనుల్లో నాణ్యతపై లేదు ఈ విషయం గద్వాల టీజీ ఆర్టీసీ డిఎం, మరియు సంబంధిత అధికారులు పర్యవేక్షించకపోవడంపై ప్రజలు వారిపై కూడా అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు, ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించి, పనులను పరిశీలించి కాంట్రాక్టర్ పై తగు చర్యలు తీసుకోవాలని, చర్యలు తీసుకోకపోతే త్వరలోనే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్తామని ప్రజలు అన్నారు



# గద్వాల గడ్డపై బీసీ సింహ గర్జన..

# హక్కుల సాధనకు ఉద్యమ కార్యాచరణ

**గద్వాల( ప్రజా జ్యోతి) సెప్టెంబర్ 18:**

బీసీల హక్కులు, ఆత్మగౌరవం,సముచిత రాజకీయ ప్రాతినిధ్యం కోసం గద్వాల గడ్డపై నిర్వహించిన బీసీ సింహ గర్జన కార్యక్రమం విజయవంతమైంది. టీపీసీసీ పిలుపు మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమానికి గద్వాల జిల్లా డీసీసీ అధ్యక్షుడు రాజీవ్ రెడ్డి అధ్యక్షత వహించగా, తెలంగాణ ప్రభుత్వ సలహాదారు,బీసీ సంక్షేమంఅభివృద్ధి అంశాల బాధ్యతలు నిర్వహిస్తున్న వి. హన్మంతరావు ముఖ్య అతిథిగాహాజరయ్యారుఈ సందర్భంగా వి. హన్మంతరావు మాట్లాడుతూ,బీసీల హక్కుల సాధన కోసం ప్రజాస్వామ్య,రాజ్యాంగబద్ధ మార్గంలో ఉద్యమాన్ని మరింత విస్తృతం చేయాల్సిన అవసరం ఉందన్నారు.రాష్ట్రవ్యాప్తంగా 100 రోజుల పాటు సభలు, సమావేశాలు నిర్వహించి బీసీలను చైతన్యపరిచేకార్యక్రమాలుచేపడతామని,అనంతరం ఢిల్లీలో పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహించే దిశగా కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు.డీసీసీ అధ్యక్షుడు రాజీవ్ రెడ్డి మాట్లాడుతూ,బీసీ పిల్లలకు నాణ్యమైన విద్య,యువతకు ఉద్యోగఉపాధి అవకాశాలు,మహిళలకు ఆర్థిక సాధికారత,బీసీ వృత్తులకు ప్రోత్సాహం, జనాభా నిష్పత్తికి అనుగుణంగా రాజకీయ ప్రాతినిధ్యం కోసం బీసీలలో ఐక్యత, చైతన్యం,సంఘటిత పోరాటంఅవసరమన్నారు.42 శాతం రిజర్వేషన్ల డిమాండ్‌తో పాటు బీసీల హక్కుల సాధన కోసం ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అనంతరం పాత బస్టాండ్ నుంచి కృష్ణవేణి చౌరస్తాలోని మహాత్మా జ్యోతిరావు పూలే,డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాల వరకు ర్యాలీ నిర్వహించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్‌ను కలిసి ఓబీసీ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో ఏఐసీసీ ఓబీసీ రుద్ర సంతోష్,టీపీసీసీ జనరల్ సెక్రటరీ శ్రీనివాస్ గౌడ్, మహబూబ్‌నగర్ డీసీసీ అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్,రాజీవ్ గాంధీ పంచాయతీరాజ్ సంఘ్ స్టేట్ చైర్మన్ రాజేందర్ ప్రసాద్ యాదవ్,తెలంగాణ రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ గట్టు తిమ్మప్ప,టీపీసీసీ నాగర్‌కర్నూల్ పార్లమెంటు ఇన్‌చార్జి కొండేటి మల్లయ్య, టీపీసీసీ ఓబీసీ కన్వీనర్ ధనలక్ష్మి తదితర నాయకులు,ప్రజాప్రతినిధులు,సర్పంచులు,కౌన్సిలర్లు పాల్గొన్నారు.





# ఎంబీ.బీఎస్ సీటు సాధించిన నరేందర్‌కు ఘన సత్కారం

## గద్వాల పేరు నిలబెట్టేలా ఉన్నత శిఖరాలు అధిరోహించాలి: బీఎస్ కేశవ్:మాజీ మున్సిపల్ చైర్మన్

**ఆలంపూర్ సెప్టెంబర్ 18(ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి)**

గద్వాల జిల్లా కేంద్రంలోని 12వ వార్డుకు చెందిన జ్యోతినాగరాజ్ దంపతుల కుమారుడు నరేందర్ నారాయణ ఆరోగ్య విశ్వవిద్యాలయం ద్వారా మహబూబ్‌నగర్ ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఉచిత ఎంబీ.బీఎస్ సీటు సాధించిన సందర్భంగా శుక్రవారం గద్వాల మాజీ మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్ ఆయనను ఘనంగా శాలువాతో సత్కరించి అభినందించారు.ఈ సందర్భంగా బీఎస్ కేశవ్ మాట్లాడుతూ నరేందర్ సాధించిన విజయం తల్లిదండ్రులకు, గద్వాల ప్రజలకు గర్వకారణమన్నారు. పట్టుదలతో చదివి వైద్య విద్యలో ఉన్నతంగా రాణించి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో మంచి వైద్యుడిగా ఎదిగి సమాజానికి సేవ చేస్తూ గద్వాల పేరును మరింత ఉన్నతంగా నిలబెట్టాలని నరేందర్‌ను అభినందించారు. నరేందర్ విజయం ఇతర విద్యార్థులకు కూడా స్ఫూర్తిగా నిలవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో 12వ వార్డు కౌన్సిలర్ లతా రామకృష్ణ, 21వ వార్డు కౌన్సిలర్ పులిపాటి వెంకటేష్, 24వ వార్డు కౌన్సిలర్ గువ్వల గోపాల్, బి.ఆర్.ఎస్ పార్టీ సీనియర్ నాయకులు చిత్తారి కిరణ్, కమ్మరి రాము, సాక్రే శ్రీనివాసులు, తిప్పన తదితరులు పాల్గొన్నారు.



# నేడే జిల్లా స్థాయి హిందీ దినోత్సవ వేడుకలు

- హిందీ భాషా వైభవాన్ని చాటుదాం
- భాషా పండితులు భారీగా తరలి రావాలి
- పండిత పరిషత్ జిల్లా అధ్యక్షుడు విజయకుమార్

**నాగర్ కర్నూల్ : సెప్టెంబర్ 17 (ప్రజా జ్యోతి)**



నాగర్‌కర్నూలు జిల్లా కేంద్రంలోని వెలమ ఫంక్షన్ హాల్‌లో నేడు (శనివారం)నిర్వహించే జిల్లాస్థాయిజాతీయ హిందీ దినోత్సవ వేడుకలకు జిల్లా నలుమూలల నుంచి ఉపాధ్యాయులు,విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని జిల్లా పండిత పరిషత్ అధ్యక్షులు బి.ఈ.విజయకుమార్,ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు.హిందీ భాష ప్రాముఖ్యతను చాటిచెప్పడంతోపాటు విద్యార్థులు,ఉపాధ్యాయుల్లో హిందీ భాషపై ఆసక్తి,గౌరవాన్ని పెంపొందించేందుకు వేడుకలను నిర్వహిస్తున్నామని,కార్యక్రమానికి హాజర య్యే ఉపాధ్యాయులకు ఓ.డీ సౌకర్యం కల్పింస్తున్నామని అన్ని మేనేజ్‌మెంట్లకు చెందిన కేజీబీవీ పాఠశాల ఉపాధ్యాయులకు కూడ ఈ సౌకర్యం ఉంటుందన్నారు.ఈ వేడుకల్లో విద్యార్థులు,ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు హిందీభాషకు సంబంధించిన ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వారు తె లిపారు.ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే డా.కూచుకుళ్ల రాజేశ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానుండగా, జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్,జిల్లా విద్యాధికారి రమేష్ కుమార్,అధికారులు, ప్రముఖులు పాల్గొననున్నారని,జిల్లావ్యాప్తంగా ఉన్న ఉపాధ్యాయులు,విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని జాతీ య హిందీ దినోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని జిల్లా పండిత పరిషత్ నాయకులు కోరారు.

# డిగ్రీ ఒక్కటే కాదు!భవిష్యత్ పోటీని ఎదుర్కొనే నైపుణ్యాలు అవసరం

## – విద్యార్థులు సామాజిక బాధ్యతను పెంపొందించుకోవాలి

## – జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్

**నాగర్ కర్నూల్ : సెప్టెంబర్ 18 (ప్రజా జ్యోతి)**

విద్యార్థులు కేవలం మౌలిక వసతులు,డిగ్రీ సాధించడంపైనే దృష్టి పెట్టకుండా భవిష్యత్‌లో ఎదురయ్యే పోటీని తట్టుకునేలా విద్యా ప్రమాణాలను, నైపుణ్యాలను పెంపొందించుకోవాలని,అకామిక్తో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, విస్తృత జ్ఞానం,సామాజిక బాధ్యతను పెంపొందించుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ పిలుపునిచ్చారు. శుక్రవారం నాగర్ కర్నూల్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో ఏర్పాటుచేసిన తెలంగాణ భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో గత వారం రోజులుగా డిగ్రీ కళాశాల విద్యార్థులతో నిర్వహించిన తెలుగు భాష-సంస్కృతి కార్యక్రమాల ముగింపు కార్యక్రమానికి కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అకాడమిక్ పై మరింత దృష్టి సారించాల్సిన అవసరం ఉందని,తెలంగాణతో పాటు దేశవ్యాప్తంగా వేలాది డిగ్రీ కళాశాలలు న్నాయని,ప్రతి సంవత్సరం లక్షలాది మంది విద్యార్థులు డిగ్రీ పూర్తి చేస్తున్నారని ఇటువంటి పరిస్థితుల్లో కేవలం డిగ్రీ పట్టా చేతిలో ఉండటం ఉద్యోగ మార్కెట్‌లో పోటీని ఎదుర్కొనేందుకు సరిపోదని, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మెషిన్ లెర్నింగ్,డేటా సైన్స్ వంటి ఆధునిక సాంకేతికరంగాలు వేగంగా అభివృద్ధి చెందు తున్న నేపథ్యంలో ఉద్యోగ,ఉపాధి అవకాశాల్లో పోటీ మరింత పెరుగుతోందని,విద్యార్థులు తమ డిగ్రీ విద్యతో పాటు మార్కెట్ అవసరాలకు అనుగుణంగా అదనపు నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలన్నారు.విద్యార్థులు ఒకేరకమైన ఉద్యోగానికి పరిమితం కాకుండా తమ ఆసక్తి, సామర్థ్యాలకు అనుగుణంగా సంప్రదాయేతర రంగాల్లోని అవకాశాలను అన్వేషించాలని,హాస్పిటాలిటీ రంగాలతో పాటు ప్రజాజీవితం,రాజకీయ రంగం తదితర విభిన్న రంగాల్లోనూ తమ ప్రతిభకు అనుగుణంగా అవకాశాలను పరిశీలించవచ్చని అన్నారు.కళాశాల విద్య పూర్తయ్యేలోపే తమ భవిష్యత్ లక్ష్యాన్ని నిర్దేశించుకుని, దానిని సాధించేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి ప్రారంభించాలని,లక్ష్యాన్ని నిర్ణయించుకున్న తర్వాత అవసరమైన విద్య,నైపుణ్యాలుఅనుభవాన్ని సమకూర్చుకునేందుకు నిరంతరం ప్రయత్నించాలని,డిగ్రీ పొందడం ద్వారా విద్యార్థులకు సమాజం పట్ల బాధ్యత కూడా ఏర్పడుతుందని,ముఖ్యంగా గ్రామీణప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు స్వగ్రామాలు,స్థానిక వార్డుల్లో చురుకై నపాత్ర పోషించాలని,విద్యార్థులు కేవలం తరగతి గదిలోని పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా సమాజంలో జరుగుతున్న పరిణామాలను గమనించాలన్నారు.రాష్ట్ర,జాతీయ స్థాయిలో జరుగుతున్న





పరిణామాలపై అవగాహన పెంచుకోవడంతో పాటు సమకాలీన అంశాలపై విస్తృత జ్ఞానాన్ని సంపాదించుకోవాలన్నారు.వెనుకబడిన ప్రాంతంగా ఉన్న నాగర్క ర్నూల్ జిల్లా నుంచి విద్యార్థులు ఉ న్నత స్థాయికి ఎదగడానికి విద్యతో పాటు నైపుణ్యాలు, ఆత్మవిశ్వాసం,సామాజిక అవగాహన ఎంతో అవసరమని,ప్రతి విద్యార్థి తనలోని ప్రతిభను గుర్తించి,దానిని సమాజ ప్రయోజనానికి ఉపయోగించే దిశగా ముందుకు సాగాలని తెలంగాణ భాష, సంస్కృతి,సంప్రదాయాల పట్ల గౌరవాన్ని పెంపొందించుకోవడంతో పాటు ఆధునిక ప్రపంచానికి అవసరమైన సాంకేతిక,వృత్తి నైపుణ్యాలను కూడా అలవరచుకోవాలని,అకాడమిక్ కు మాత్రమే పరిమితం కాకుండా విస్తృత జ్ఞానాన్ని సంపాదించుకుని,తమ విద్యను వ్యక్తిగత అభివృద్ధితో పాటు సమాజాభివృద్ధికి ఉపయోగించాలని కోరారు.అనంతరం వారం రోజులుగా నిర్వహించిన తెలుగు భాషాసంస్కృతి కార్యక్రమాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించి,ప్రోత్సాహం అందించారు.కార్యక్రమంలో తెలంగాణ సంస్కృతికశాఖ సలహాసభ్యులు,కవి,ముచ్చర్ల దినకర్ రావ్, ప్రిన్సిపల్ డాక్టర్. గీతాంజలి,కళాకారులు శంకర్,కళాశాల అధ్యాపకులు, భాషాసాంస్కృతిక శాఖ ప్రతినిధులు,విద్యార్థులు పాల్గొన్నారు.

# రేపల్లెలో కూల్చివేసిన దళితుడి ఇంటిని పరిశీలించిన ఎస్సీ,ఎస్టీ కమిషనర్ చైర్మన్ బక్కి వెంకటయ్య



**గద్వాల (ప్రజా జ్యోతి) సెప్టెంబర్ 18:**



కూల్చివేసినట్లు ఆరోపణలుఎదుర్కొంటున్న ఇంటిని శు క్రవారం తెలంగాణ రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య పరిశీలించారు. ఘటనకు సంబంధించిన వివరాలను బాధితులు, స్థానికుల నుంచి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ, బాధితులకు అండగా ఉంటామని ఘటనపై పూర్తి వివరాలను పరిశీలించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలుతీసుకుంటామని హామీ ఇచ్చారు.చైర్మన్ రేపల్లె గ్రామానికి వచ్చిన సందర్భంగా భీమ్ ఆర్మీ ఉమ్మడిమహబూబ్‌నగర్ జిల్లా ఇన్‌చార్జి మాచర్ల ప్రకాష్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు.అలాగే ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు పూడూర్ చిన్నయ్య చైర్మన్‌ను కలిసి ఘటనకు సంబంధించిన వివరాలను వివరించారు.కులాంతర వివాహం అనంతరం చోటుచేసుకున్న ఇంటి కూల్చివేత ఘటనపై ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ గ్రామానికి రావడంతో బాధిత కుటుంబానికి న్యాయం జరుగుతుందనే ఆశాభావం వ్యక్తమైంది.

# పాఠశాలల్లో పరిశుభ్రత, మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి

## - కొత్త మొల్గర జెడ్పీ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 18 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

భూత్పూర్ మండలం కొత్త మొల్గర గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న మౌలిక వసతులు, పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సౌకర్యాలను పరిశీలించారు. తరగతి గదులు, పాఠశాల ప్రాంగణం, క్రీడా మైదానం, మరుగుదొడ్లను స్వయంగా పరిశీలించి పరిశుభ్రత పరిస్థితులను సమీక్షించారు. విద్యార్థుల ఆరోగ్యం, విద్యాభ్యాసానికి పరిశుభ్రమైన వాతావరణం ఎంతో అవసరమని ఆయన పేర్కొన్నారు. పాఠశాల ఆవరణలో ప్రతిరోజూ పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని పాఠశాల యాజమాన్యం, గ్రామ పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో నేరుగా మాట్లాడిన అదనపు కలెక్టర్.. తాగునీరు, విద్యుత్, ఫ్యాన్ల పనితీరు, మధ్యాహ్న భోజనం నాణ్యత తదితర అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. పాఠశాలలో మౌలిక వసతులకు సంబంధించి సమస్యలు, లోపాలు ఉంటే వాటిని గుర్తించి వెంటనే పరిష్కరించాలని క్షేత్రస్థాయి అధికారులను ఆదేశించారు. గ్రామీణ ప్రాంత ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం, అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు జిల్లా యంత్రాంగం నిరంతరం కృషి చేస్తుందని మధుసూదన్ నాయక్ తెలిపారు.



# ప్రతి మారుమూల ప్రాంతానికీ మెరుగైన కమ్యూనికేషన్ సౌకర్యాలు

## - జిల్లాలో కమ్యూనికేషన్ సౌకర్యాల విస్తరణకు చర్యలు

## - మారుమూల ప్రాంతాల్లో 4జీ సాచ్యురేషన్ మోడ్స్ ఏర్పాటు చేయాలి

## - జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్

**నాగర్‌కర్నూల్ : సెప్టెంబర్ 18 (ప్రజా జ్యోతి)**

జిల్లాలోని నల్లమల్ల అటవీ ప్రాంతంతో పాటు కలెక్టరేట్,మారుమూల ప్రాంతాల్లో బీ.ఎస్.ఎన్.ఎల్ 4జీ కమ్యూనికేషన్ సాచ్యురేషన్ మోడ్స్ ఏర్పాటు చేసి మెరుగైన నెట్‌వర్క్ సేవలు అందుబాటులోకి తే వాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ బిఎస్ఎన్ఎల్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. శు క్రవారం నాగర్ కర్నూల్ కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ హాల్లో అచ్చంపేట సబ్ కలెక్టర్ సలోని చాబ్రా,జిల్లా అటవీ శాఖ అధికారి రేవంత్ చంద్రతో కలిసి బీఎస్ఎన్ఎల్ అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో సెల్‌ఫోన్ టవర్ కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌ను విస్తరించి ప్రజలకు మెరుగైన నెట్‌వర్క్ సేవలు అందించేందుకు అవసరమైన ప్రాంతాలలో టవర్ల ఏర్పాటు, భూసేకరణ,అనుమతులు తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. ముఖ్యంగా నల్లమల్ల అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేయనున్న కమ్యూనికేషన్ టవర్ల వల్ల వన్యప్రాణులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అటవీశాఖ నిబంధనలకు అనుగుణంగా అవసరమైన అన్నీ జాగ్రత్త లు తీసుకోవాలని,పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ టవర్ల ఏర్పాటుకు అనువైన ప్రాంతాలను గుర్తించి చర్యలు చేపట్టాలన్నారు. అదేవిధంగా జిల్లాలోని వివిధ మారుమూల ప్రాంతాలలో నివసిస్తున్న చెంచు గిరిజన ప్రజలకు మెరుగైన కమ్యూనికేషన్ నెట్‌వర్క్ సేవలు అందేలా అవసరమైన చోట్ల బీఎస్ఎన్ఎల్ టవర్లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. మెరుగైన కమ్యూనికేషన్ తో ప్రభుత్వ సేవలు,అత్యవసర సమచారం,డిజిటల్ సేవలు ప్రజలకు మరింత సులభంగా అందుబాటులోకి వస్తాయని, టవర్ల ఏర్పాటుకు అవసరమైన భూమి,అనుమతుల విషయంలో అటవీ,రెవెన్యూ శాఖల అధికారులు, బీఎస్ఎన్ఎల్ అధికారులతో సమన్వయం చేసుకొని ప్రక్రియను వేగవంతం చేసి ప్రజలకు మెరుగైన కమ్యూనికేషన్ సౌకర్యం కల్పించే దిశగా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి త్వరితగతిన చర్యలు చేపట్టాల ని సూచించారు. ఈ సమావేశంలో బిఎస్ఎన్ఎల్ అధికారులు వాసు మరికంటి,సుధీర్, సురేష్,నరసయ్య,కలెక్టరేట్ సూపరిండెంట్ శోభ తదితరులు పాల్గొన్నారు.



# వసతి గృహంలో విద్యార్థుల సమస్యలు తెలుసుకున్న కలెక్టర్

## - నీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశం

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 18 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

మహబూబ్‌నగర్ పట్టణంలోని మెట్టుగడ్డ సమీపంలో ఉన్న ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర కళాశాల వసతి గృహాన్ని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతి గృహంలోని గదులను పరిశీలించిన కలెక్టర్ విద్యార్థులతో నేరుగా మాట్లాడి, వారికి అందుతున్న వసతులు, ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బోర్‌లో భూగర్భ జలమట్టం తగ్గిపోవడంతో నీటి ప్రవాహం తగ్గిందని విద్యార్థులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. విద్యార్థులు వెల్లడించిన సమస్యలను పరిశీలించిన కలెక్టర్.. వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు వసతి గృహ పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని, క్రమశిక్షణతో మెలగాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వం కల్పిస్తున్న వసతి, విద్యా సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని శ్రద్ధగా చదివితే నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించవచ్చుని విద్యార్థులకు సూచించారు. అనంతరం వార్డెన్ కార్యాలయంలోని రికార్డులు, హాజరు రిజిస్టర్, సీసీటీవీ కెమెరాల నిర్వహణను కలెక్టర్ పరిశీలించారు. వసతి గృహ పరిస్థితులపై జిల్లా గిరిజన సంక్షేమ అభివృద్ధి అధికారితో ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అసిస్టెంట్ కలెక్టర్ (అండర్ ట్రైనీ) సాయి శివాని కలెక్టర్ వెంట ఉన్నారు.



# వినాయక నిమజ్జనానికి పటిష్ట ఏర్పాట్లు

## - అప్పనపల్లిలో కృత్రిమ బేబీ కుంటలను పరిశీలించిన కలెక్టర్ ఖుష్బూ గుప్తా

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 18 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకుని జిల్లాలో వినాయక విగ్రహాల నిమజ్జనానికి జిల్లా యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేపట్టింది. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో పలు చెరువులు, కుంటల్లో నీటి లభ్యత తక్కువగా ఉండటంతో చిన్న, మధ్యతరహా విగ్రహాల నిమజ్జనం కోసం ప్రత్యామ్నాయంగా కృత్రిమ బేబీ కుంటలను ఏర్పాటు చేశారు. మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఐదు అడుగుల ఎత్తు వరకు ఉన్న విగ్రహాల నిమజ్జనం కోసం అప్పనపల్లి సమీపంలోని మయూరి పార్క్ ఎదురుగా గంగోస్కుంట వద్ద రెండు పెద్ద కృత్రిమ బేబీ కుంటలను ఏర్పాటు చేశారు. అలాగే పంచవటి స్కూల్ సమీపంలోని పార్కు స్థలంలోనూ కృత్రిమ కుంటలను సిద్ధం చేశారు. అప్పనపల్లిలో గంగోస్కుంట వద్ద ఏర్పాటు చేసిన కృత్రిమ బేబీ కుంటలను జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా శుక్రవారం పరిశీలించారు. నిమజ్జనానికి వచ్చే భక్తులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నిమజ్జన ప్రాంతాల్లో పారిశుధ్యం, విద్యుత్, లైటింగ్, తాగునీరు, భద్రత తదితర సౌకర్యాలను పూర్తిస్థాయిలో కల్పించాలని సూచించారు. చిన్న, మధ్యతరహా వినాయక విగ్రహాల నిమజ్జనం కోసం మండపాల నిర్వాహకులు, ప్రజలు తమకు సమీపంలోని కృత్రిమ బేబీ కుంటలను వినియోగించుకోవాలని కలెక్టర్ కోరారు. జిల్లా యంత్రాంగం ఏర్పాటు చేసిన నిమజ్జన ప్రదేశాలను వినియోగించుకుని సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కృత్రిమ కుంటలను వినియోగించడం ద్వారా నీటి కాలుష్యాన్ని నివారించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని సూచించారు.జిల్లాలోని ఇతర మున్సిపాలిటీల్లోనూ చిన్న, మధ్యతరహా వినాయక విగ్రహాల నిమజ్జనం కోసం కృత్రిమ బేబీ కుంటలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. దేవరకద్ర మున్సిపాలిటీ పరిధిలో స్టేషన్ రోడ్‌లోని చర్చి సమీపంలో, జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలో మున్సిపల్ కార్యాలయం వద్ద, బీసీ హాస్టల్ వెనుక మూడో వార్డు పార్కులో, 8వ వార్డు హౌసింగ్ బోర్డు కాలనీ పార్కులో కృత్రిమ బేబీ కుంటలను ఏర్పాటు చేశారు. భూత్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని రాందాస్ తండాలోనూ కృత్రిమ కుంటను సిద్ధం చేశారు.కలెక్టర్ వెంట అసిస్టెంట్ కలెక్టర్ (అండర్ ట్రైనీ) సాయి శివాని, మున్సిపల్ సిబ్బంది తదితరులు ఉన్నారు.



# బీరం లక్ష్మారెడ్డి మృతికి మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ సంతాపం

## - పార్థివదేహానికి నివాళులర్పించిన పలువురు మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు

**మహబూబ్ నగర్ సెప్టెంబర్ 18 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి తండ్రి బీరం లక్ష్మారెడ్డి మృతి పట్ల మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.లక్ష్మారెడ్డి పలుమార్లు సింగిల్ విండో అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తిస్తూ ప్రజలకు, రైతాంగానికి అందించిన సేవలు చిరస్మరణీయమని శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. ఆయన మరణం బీరం హర్షవర్ధన్ రెడ్డి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులకు తీరని లోటని అన్నారు. లక్ష్మారెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, విషాద సమయంలో కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు.బీరం లక్ష్మారెడ్డి పార్థివదేహానికి మాజీ మంత్రులు వి. శ్రీనివాస్ గౌడ్, నిరంజన్ రెడ్డి, లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్ రెడ్డి, ఎస్. రాజేందర్ రెడ్డి, చిట్టెం రామ్మోహన్ రెడ్డి, మర్రి జనార్ధన్ రెడ్డి, అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు తదితరులు నివాళులర్పించారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డిని పరామర్శించి, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బీరం లక్ష్మారెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.



# ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

## - మల్టీస్పెషాలిటీ క్రిటికల్ కేర్ యూనిట్‌ను ప్రారంభించిన మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్

**మహబూబ్‌నగర్ సెప్టెంబర్ 19 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**



జిల్లా కేంద్రంలోని రాజేంద్రనగర్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన మహబూబ్‌నగర్ మల్టీస్పెషాలిటీ క్రిటికల్ కేర్ యూనిట్‌ను మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆసుపత్రిని సందర్శించిన ఆయన వైద్యులను అభినందించారు. మహబూబ్‌నగర్ ప్రజలకు నాణ్యమైన, మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు అత్యవసర పరిస్థితుల్లో వేగంగా వైద్య సహాయం అందేలా కృషి చేయాలని ఆకాంక్షించారు. ప్రాంత ప్రజలకు ఆధునిక వైద్య సదుపాయాలు అందుబాటులోకి రావడం అభినందనీయమని శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు.

# ఇందువాసి పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

**గద్వాల సెప్టెంబర్ 18(ప్రజా జ్యోతి ప్రతినిధి):**

విధి నిర్వహణలో నిర్లక్ష్యం,నిధుల దుర్వినియోగంకు పాల్పడిన గట్టు మండలం,ఇందువాసి గ్రామపంచాయతీ కార్యదర్శి గొల్ల శేఖర్ ను సస్పెండ్ చేసినట్లు జిల్లా పంచాయతీ అధికారి శ్రీకాంత్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.కొన్ని రోజుల కిందట పంచాయతీ సెక్రెటరీ శేఖర్ పై పలు ఆరోపణలు రాగా ఉన్నతాధికారులు పలుమార్లు గ్రామంలో విచారణ చేపట్టడం జరిగిందన్నారు.పంచాయతీకి సంబంధించిన వివిధ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం కార్యదర్శి విధుల్లో అలసత్వం వహించినట్లు తేలిందన్నారు.సమగ్ర నివేదికను జిల్లా కలెక్టర్ కు సమర్పించగా ఆయన ఆదేశాల మేరకు శేఖర్ ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందని డిపిఓ పేర్కొన్నారు.

# సేవాభావంతో సురక్ష గణపతి వద్ద అన్నదానం

- ప్రజలకు, పోలీసు సిబ్బందికి స్వయంగా భోజనం వడ్డించిన ఎస్పీ జానకి

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 18 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన సురక్ష గణపతి సన్నిధిలో శుక్రవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా ఎస్పీ దరావత్ జానకి కార్యక్రమంలో పాల్గొని ప్రజలకు, పోలీసు సిబ్బందికి స్వయంగా భోజన ప్రసాదాలను వడ్డించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. వినాయక చవితి వేడుకల్లో భక్తి, సేవాభావంతో నిర్వహించే కార్యక్రమాలు ప్రజల్లో ఐక్యత, సౌభ్రాతృత్వం, ఆధ్యాత్మిక భావనలను పెంపొందిస్తాయని అన్నారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో ప్రజలు, పోలీసు సిబ్బంది ఉత్సాహంగా పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు.సురక్ష గణపతి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ ప్రజల సంక్షేమం, జిల్లాలో శాంతిభద్రతలు సక్రమంగా కొనసాగాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎ ఆర్ అదనపు ఎస్పీ సురేష్ కుమార్, డీఎస్పీ వెంకటేశ్వర్లు, వర్టికల్ డీఎస్పీ బాలాజీ, వన్ టౌన్ ఇన్స్పెక్టర్ అప్పయ్య, టూ టౌన్ ఇన్స్పెక్టర్ ఇజాజ్ ఉద్దీన్, ఆర్ ఐ లు కృష్ణయ్య, నగేష్, అశోక్ కుమార్, ఆర్ ఎస్ఐ లు, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్యారసాని సురేష్ తదితర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.





# దళితుల సమస్యలపై సత్వరమే న్యాయం జరగాలి.

మహనీయుల విగ్రహాలకు రక్షణ కల్పించాలి.

వివిధ అంశాలపై కమిషన్ చైర్మన్ ప్రత్యేక దృష్టి సారించాలి.

మీసాల రామన్న మాదిగ - తెలంగాణ దండోరా వ్యవస్థాపక అధ్యక్షుడు.

**వీపనగండ్ల ప్రజా జ్యోతి రిపోర్టర్.**

దళితులపై జరుగుతున్న దాడులు, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు, మహనీయుల విగ్రహాలకు రక్షణ తదితర వాటిపై సత్వరమే న్యాయం జరిగే విధంగా చూడాలని, తెలంగాణ దండోరా వ్యవస్థాపక అధ్యక్షులు మీసాల రామన్న మాదిగ కోరారు. వనపర్తి జిల్లా కేంద్రంలోని తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యను, మీసాల రామన్న మాదిగ మర్యాదపూర్వకంగా కలిసి, శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం దళితులు, గిరిజనులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా మీసాల రామన్న మాదిగ మాట్లాడుతూ రాష్ట్రంలో దళితులపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు కఠినమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద నమోదవుతున్న కేసుల్లో బాధితులకు న్యాయం జరిగేలా సంబంధిత అధికారులు సమర్థవంతంగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. అట్రాసిటీ కేసుల నమోదుతో పాటు, కేసుల దర్యాప్తు, బాధితులకు అందాల్సిన న్యాయం, చట్టపరమైన రక్షణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. అదేవిధంగా ఈ దేశానికి దిక్సూచి, దళిత, గిరిజనుల ఆత్మగౌరవానికి ప్రతీకలైన మహనీయుల విగ్రహాలకు రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. మహనీయుల విగ్రహాలను ధ్వంసం చేయడం లేదా అవమానించే ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు రక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. దళితులు, గిరిజనుల హక్కులు, భద్రత, సామాజిక గౌరవం కోసం ఎస్సీ, ఎస్టీ కమిషన్ మరింత చురుకైన పాత్ర పోషించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. దళిత, గిరిజనులకు న్యాయం జరిగేలా సంబంధిత సమస్యలను కమిషన్ దృష్టికి తీసుకురావడం ద్వారా ప్రజల్లో చట్టపరమైన అవగాహన పెంచడంతో పాటు, బాధితులకు అండగా నిలవాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా మీసాల రామన్న పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ... తన దృష్టికి వచ్చిన వివిధ సమస్యలను తెలుసుకుని, పరిష్కరించే దిశగా ముందుకు సాగుతూ, అధికారులకు ఆదేశాలు జారీ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ దళిత సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# పెద్దపల్లిలో ఘనంగా వినాయక చవితి ఆధ్యాత్మిక కార్యక్రమం

## - వ్యసనాలకు దూరంగా ఉండాలి.. ఆధ్యాత్మికంగా ఎదగాలి

**మల్దకల్ సెప్టెంబర్ 18(ప్రజా జ్యోతి ప్రతినిధి):**

వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని పెద్దపల్లి గ్రామంలో సర్పంచ్ అల్వాల శిరీష రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ఈశ్వరీయ విశ్వవిద్యాలయం బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా 'వ్యసనముక్త్ భారత్' కార్యక్రమంలో భాగంగా యువత,ప్రజలు మత్తు పదార్థాలు,ఇతర వ్యసనాలకు దూరంగా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు,పాటించాల్సిన సూచనలను బ్రహ్మకుమారీస్ ప్రతినిధులు వివరించారు.వ్యసనాల వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ ఆరోగ్యకరమైన,ఆధ్యాత్మిక జీవన విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు.అలాగే వినాయక చవితి పండుగ వెనుక ఉన్న ఆధ్యాత్మిక విశేషాలు,విఘ్నేశ్వరుని తత్వం, పండుగ ప్రాధాన్యతను వివరించారు.కార్యక్రమంలో బీకే మంజుల,బీకే గౌరమ్మ,బీకే జయమ్మ,బీకే జయలక్ష్మి పాల్గొని ఆధ్యాత్మిక సందేశాన్ని అందించారు.కార్యక్రమంలో ఉపసర్పంచ్ లక్ష్మి నర్సిములు,వార్డు సభ్యులు సవారీ,గుడిసె కిష్టన్న,వెంకటేష్,గ్రామ పెద్దలు శివన్న,కుర్వ నర్సింహా,శ్రీశైలం,ఉల్వ నర్సింహా,నరేందర్,రమేష్,టి.నర్సింహా, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ అల్వాల శిరీష రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ,ప్రజలు వ్యసనాలకు దూరంగా ఉంటూ ఆధ్యాత్మిక విలువలను పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు.



# ఎవరి ప్రమేయం తేలినా చట్టప్రకారం చర్యలు

## జిల్లా ఎస్పీ టి.శ్రీనివాసరావు

- నరేష్ ఘటనపై చట్టపరమైన చర్యల్లో ఎలాంటి జాప్యం లేదు
- గద్వాల కేసులో దర్యాప్తు పూర్తి చేసి చార్జ్‌షీట్ దాఖలు..
- ప్రస్తుతం కోర్టు పరిధిలో విచారణ
- ఆత్మహత్య ఘటనపై హైదరాబాద్‌లో ప్రత్యేక కేసు..



**గద్వాల సెప్టెంబర్ 18(ప్రజా జ్యోతి ప్రతినిధి):**

నరేష్ కుటుంబ వివాదానికి సంబంధించి పోలీస్ శాఖపై సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంపై జిల్లా ఎస్పీ టి.శ్రీనివాసరావు స్పందించారు.ఘటనకు సంబంధించిన వాస్తవ పరిస్థితులను వెల్లడిస్తూ,చట్టపరమైన చర్యల్లో ఎలాంటి జాప్యం జరగలేదని స్పష్టం చేశారు.మృతుడు నరేష్ భార్య రాణి తన భర్త వేధింపులకు గురిచేస్తున్నాడంటూ గద్వాల టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుపై స్పందించిన పోలీసులు భార్యాభర్తలను సఖీ సెంటర్‌కు కౌన్సెలింగ్ కోసం పంపించారు.సఖీ సెంటర్‌లో దంపతులు మూడు దఫాలుగా కౌన్సెలింగ్‌కు హాజరైనప్పటికీ సమస్య పరిష్కారం కాలేదు.సఖీ సెంటర్ నుంచి అందిన నివేదిక, ఫిర్యాదుదారురాలి ఫిర్యాదు ఆధారంగా గద్వాల టౌన్ పోలీస్ స్టేషన్‌లో 08-04-2026న క్రైమ్ నంబర్ 94/2026,బీఎన్ఎస్ సెక్షన్ 85 కింద కేసు నమోదు చేశారు.అనంతరం చట్టప్రకారం దర్యాప్తు పూర్తి చేసి చార్జ్‌షీట్ దాఖలు చేశారు.ప్రస్తుతం ఈ కేసు న్యాయస్థానం పరిధిలో విచారణలో ఉంది.ఇదిలా ఉండగా,06-09-2026న నరేష్ శంషాబాద్ ప్రాంతంలో పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు ప్రయత్నించిన ఘటనపై హైదరాబాద్ సిటీ కమిషనరేట్ పరిధిలోని ఆర్జీఐఏ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 791/2026,బీఎన్ఎస్ సెక్షన్లు 226,125 కింద కేసు నమోదు చేశారు.చికిత్స పొందుతూ నరేష్ 14-09-2026న ఉస్మానియా ఆసుపత్రిలో మృతి చెందారు.ఈ ఘటనకు సంబంధించిన దర్యాప్తు ఆర్జీఐఏ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో కొనసాగుతోంది.గద్వాల టౌన్ పోలీస్ స్టేషన్‌లో గతంలో నమోదైన కేసులో దర్యాప్తు పూర్తి చేసి ఇప్పటికే చార్జ్‌షీట్ దాఖలు చేసినందున,ఆ కేసు ప్రస్తుతం న్యాయస్థానం పరిధిలో ఉందని ఎస్పీ తెలిపారు.నరేష్ ఆత్మహత్య ఘటనకు సంబంధించిన తదుపరి అంశాలు హైదరాబాద్ పరిధిలో నమోదైన కేసు దర్యాప్తులో భాగంగా పరిశీలించబడుతున్నాయని పేర్కొన్నారు.హైదరాబాద్ పోలీసుల దర్యాప్తులో నరేష్ ఆత్మహత్య ఘటనకు సంబంధించి ఎవరి ప్రమేయం ఉన్నట్లు ఆధారాలు వెలుగులోకి వచ్చినా,వారి స్థాయి లేదా హోదాతో సంబంధం లేకుండా చట్టప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ స్పష్టం చేశారు.దర్యాప్తులో వెలుగులోకి వచ్చే వాస్తవాలు,ఆధారాల ఆధారంగానే తదుపరి చట్టపరమైన చర్యలు చేపడతామని తెలిపారు.నేరంలో ఎవరి ప్రమేయం ఉన్నా,ఆధారాల ఆధారంగా నిష్పక్షపాతంగా దర్యాప్తు చేసి చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ టి.శ్రీనివాసరావు స్పష్టం చేశారు.

# పశువుల వివరాల డిజిటలైజేషన్‌ను 100 శాతం పూర్తి చేయాలి

## - జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్



**నాగర్ కర్నూల్ : సెప్టెంబర్ 18 (ప్రజా జ్యోతి)**

నేషనల్ డిజిటల్ లైవ్‌స్టాక్ మిషన్‌లో భాగంగా జిల్లాలోని అన్ని పశువుల వివరాలను 100 శాతం ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ అధికారులను ఆదేశించారు.శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ భవనంలో జిల్లా లో పశువుల వివరాల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు చేపట్టిన పశువుల వివరాల డిజిటలైజేషన్ ప్రక్రియపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.జిల్లాలో మొత్తం 31 లక్షల 6,607 పశువులు,ఇతర జంతువులు ఉన్నాయని ఇప్పటికి 78 శాతం పశువుల వివరాలను డిజిటలైజేషన్ చేయడం జరిగిందని అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మిగిలిన పశువుల వివరాల నమోదును వేగవంతం చేసి,లక్ష్యాన్ని 100 శాతం పూర్తిచేయాలని గ్రామాల వారీగా పశువుల వివరా ల నమోదును పర్యవేక్షిస్తూ, జంతువు వివరాలు నమోదు కాకుండా మిగిలిపోకుండా ప్రత్యేక దృష్టి సారించాలని,ఆన్‌లైన్‌లో నమోదు చేసే వివరాలు ఖచ్చితంగా,తప్పులు లేకుండా ఉండేలా సంబంధి త సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలని డిజిటల్ లైవ్‌స్టాక్ వివరాల నమోదుతో పశుసంవర్ధక శాఖ ద్వారా అందించే సేవలు,సంక్షేమకార్యక్రమాలను సమర్థవంతంగా అమలుచేసేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ దేవ సహాయం,జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ జ్ఞాన శేఖర్,జిల్లా పంచాయతీ అధికారి శ్రీరాములు,ఏడి నరసింహారావు పాల్గొన్నారు.



# ఇందిరమ్మ ఇళ్లలో చేతివాటం ప్రదర్శిస్తే క్రిమినల్ కేసులు

## - మీడియా కథనాలపై రాష్ట్ర విజిలెన్స్ అధికారుల విచారణ






**నాగర్ కర్నూల్ : సెప్టెంబర్ 18 (ప్రజా జ్యోతి)**

నాగర్‌కర్నూల్ జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు సంబంధించి మీడియాలో ఇటీవల ప్రచురితమైన వివిధ వార్తా దిన పత్రికల కథనాలపై రాష్ట్ర విజిలెన్స్ అధికారి బాలరాం,డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆధ్వర్యంలో శుక్రవారం నాగర్కర్నూల్ నియోజకవర్గం లోని బిజినపల్లి మండలం,అచ్చంపేట పట్టణంలో పర్యటించి విచారణ చేపట్టారు.ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో సంబంధిత ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్ అధికారులతో సమావేశమై,మీడియా కథనాల్లో ప్రస్తావించిన అంశాలపై పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులకు సంబంధించిన అంశాలపై అధికారుల నుంచి వివరణలు తీసుకున్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర విజిలెన్స్ అధికారి బాలరాం మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో అధికారులు లేదా ఇతర వ్యక్తులు ఎవరైనా చేతివాటం ప్రదర్శించినట్లు తేలితే ఉపేక్షించేది లేదని,అలాంటి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని,లబ్ధిదారులకు ప్రభుత్వం అందిస్తున్న సహాయం వారికి పూర్తిస్థాయిలో అందేలా అధికారులు నిష్పక్షపాతంగా,పారదర్శకంగా వ్యవహరించాలని సూచించారు.బిజినపల్లి, అచ్చంపేట పట్టణాల్లో లబ్ధిదారుల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేయడం, ఇతర అక్రమాలకు పాల్పడినట్లు నిర్ధారణ అయితే, బాధ్యులపై కేసులు నమోదు చేసి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.విచారణ సందర్భంగా సంబంధిత అధికారులు అవసరమైన వివరాలు, వివరణలను విజిలెన్స్ అధికారులకు అందించారు. మీడియా కథనాల్లో పేర్కొన్న అంశాలపై నిబంధనల ప్రకారం పూర్తిస్థాయిలో పరిశీలించి,అవసరమైన తదుపరి చర్యలు చేపడతామని అధికారులు తెలిపినట్లు ఆయన ఈ సందర్భంగా తెలిపారు.

# వినాయక భక్తితో పాటు సేవా స్ఫూర్తి

## అందుల పాఠశాల విద్యార్థులకు భవాని నగర్ యువజన సంఘం అన్నదానం



**ఆలంపూర్ సెప్టెంబర్ 18(ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి)**

వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజు పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించిన అనంతరం భవాని నగర్ వినాయకుని కట్ట యువజన సంఘం సేవాభావాన్ని చాటుకుంది. శుక్రవారం రాత్రి రాఘవేంద్ర కాలనీలోని అందుల పాఠశాల విద్యార్థులకు ప్రత్యేకంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించింది.సాధారణంగా ఉత్సవాల సందర్భంగా వినాయక మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తుండగా, విద్యార్థుల వద్దకు వెళ్లి వారికి భోజనం అందించాలనే ఆలోచనతో కార్యక్రమం చేపట్టడం యువజన సంఘం సేవా కోపంధృక్పథానికి నిదర్శనంగా నిలిచింది. విద్యార్థులతో కలిసి భోజనం పంచుకోవడం తమకు ఎంతో ఆనందంగా ఉందని యువజన సంఘం అధ్యక్ష, కార్యదర్శులు, కమిటీ సభ్యులు తెలిపారు.ఈ సందర్భంగా అందుల పాఠశాల ప్రిన్సిపల్ రంగన్న మాట్లాడుతూ విద్యార్థుల పట్ల ఆప్యాయతతో అన్నదానం నిర్వహించిన భవాని నగర్ వినాయకుని కట్ట యువజన సంఘం సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. భక్తితో పాటు సేవా భావాన్ని చాటుతున్న యువతను అభినందించారు.ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత విస్తరించి, ఇతర వినాయక యువజన సంఘాలు కూడా అందుల పాఠశాల విద్యార్థులకు అన్నదానం, ఇతర సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు ముందుకు రావాలని ఆకాంక్షించారు. వినాయకుని కట్ట యువజన సంఘం చూపిన ఈ సేవా స్ఫూర్తి అభినందనీయమని పలువురు పేర్కొన్నారు.



ప్రజాజ్యోతి
శనివారం సెప్టెంబర్ 19, 2026

# వైకల్యం గల వారిపట్ల వివక్ష చూపరాదు

## - న్యాయ సేవ సంస్థ సెక్రటరీ నిహారిక

**నాగర్ కర్నూల్ : సెప్టెంబర్ 18 (ప్రజా జ్యోతి)**

రాష్ట్ర హైకోర్టు ఆదేశానుసారం జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ నాగర్ కర్నూల్ సెక్రటరీ నిహారిక వ రల్డ్ డెఫ్ డే ను పురస్కరించుకొని నాగర్ కర్నూల్ పట్టణంలోని డెఫ్ అండ్ డంబ్ పిల్లలున్న భవిత విలీన విద్య వనరుల కేంద్ర పాఠశాలను సందర్శించారు.ఈ సందర్భంగా మాట్లాడుతు సమాజంలో వైకల్యం గల పిల్లలపట్ల వివక్ష చూపరాదని వారికి ప్రత్యేక వసతులు కల్పించి అందరితో సమానంగా చూడాలని,నేటితరం యువత శారీరక,మానసిక సమస్యలతో బాధపడుతున్నారని అన్నారు. ఈ సందర్భంగా చిన్నారులతో మాట్లాడి వారి యొక్క సమస్యలను మరియు వారికి కల్పిస్తున్న వసతులను గురించి అడిగి తెలుసుకుని ఎవ్వరు అధైర్య పడవద్దని,ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వ్యక్తులు ఒంటరిగా ఉన్నామని భావనతో ఉంటా రు వారిలోనిభావనను తొలగించడానికి సమాజం లో మన వంతు సహాయం చేయాలని సమాజం లో వైకల్యం గల వ్యక్తుల పట్ల సహృద్భావముతో మెలగాలి అన్నారు.ఈ సందర్భంగా చిన్నారులకు పండ్లు పంపిణీ చేయడం జరిగింది. కార్యక్రమంలో పాఠశాల నిర్వాహకుడు ప్రకాష్,చిన్నారులు పాల్గొన్నారు.



## స్వచ్ఛతను నిత్యజీవితంలో భాగం చేసుకోవాలి

## ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలి: కలెక్టర్ ఖుష్బూ గుప్తా

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 18 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

వ్యాధుల బారిన పడకుండా ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా సూచించారు. ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు నిర్వహించనున్న స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలకు సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాలు, పట్టణాల్లో స్వచ్ఛతా కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, చెత్తాచెదారాన్ని తొలగించడం, పారిశుధ్య చర్యలను ముమ్మరం చేయడంతో పాటు ప్రజల్లో పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రజలందరినీ స్వచ్ఛతా కార్యక్రమాల్లో భాగస్వాములను చేయాలని, పరిశుభ్రమైన పరిసరాలతో ప్రజల ఆరోగ్యం మెరుగుపడటమే కాకుండా దేశ అభివృద్ధికి దోహదపడుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. స్వచ్ఛతను కేవలం కార్యక్రమంగా కాకుండా ప్రతి ఒక్కరి నిత్యజీవితంలో భాగంగా చేసుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, అసిస్టెంట్ కలెక్టర్ (అండర్ ట్రైనీ) సాయి శివాని, జెడ్పీ సీఈఓ/ఇన్‌చార్జి డీపీఓ వెంకట రెడ్డి, డీఆర్‌డీఓ నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.




# ఐదవ రోజు ఘనంగా పూజలందుకున్న గణనాథుడు

## - ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ప్రత్యేక పూజలు

**ఆలంపూర్ సెప్టెంబర్ 18(ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి)**

గద్వాల పట్టణంలోని గజ్జలమ్మ గుడి యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన గణనాథుడు ఐదవ రోజు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలందుకున్నారు. ఈ సందర్భంగా గద్వాల మాజీ మున్సిపల్ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు బి.ఎస్. కేశవ్ గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.ఈ సందర్భంగా గద్వాల పట్టణ ప్రజలతో పాటు గజ్జలమ్మ గుడి వీధి ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, పట్టణంలో శాంతి, సౌభ్రాతృత్వం వెల్లివిరియాలని గణనాథుని ప్రార్థించినట్లు తెలిపారు.కార్యక్రమంలో 20వ వార్డు కౌన్సిలర్ నరసింహులు, 21వ వార్డు కౌన్సిలర్ పులిపాటి వెంకటేష్, 24వ వార్డు కౌన్సిలర్ గువ్వల గోపాల్, 25వ వార్డు కౌన్సిలర్ మోహన్ యాదవ్, 26వ వార్డు మాజీ కౌన్సిలర్ కేడీఆర్ లక్ష్మి, బీఆర్ఎస్ నాయకులు రామకృష్ణ, చిత్తారి కిరణ్, కేడీఆర్ మధు తదితరులు పాల్గొని గణనాథునికి పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అదేవిధంగాభక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఈ పూజా కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణాన్ని నింపగా, యూత్ ఆధ్వర్యంలో భక్తులకు చక్కటి ఏర్పాట్లు చేయడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు.





# ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి కేటాయించిన నిధులను సద్వినియోగం చేసుకోవాలి.



**ఆలంపూర్ సెప్టెంబర్ 18**

**(ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి)**

షెడ్యూల్డ్ కులాలు, తెగల సంక్షేమానికి ప్రభుత్వం కేటాయించే నిధులను సద్వినియోగం చేసుకునేలా సంబంధిత శాఖల అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. అలాగేషెడ్యూల్డ్ కులాలు, తెగలకు సంబంధించిన ల్యాండ్, సర్వీస్, అట్రాసిటీస్, తదితర అంశాలపై శుక్రవారం ఐడిఓసి సమావేశపు మందిరంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, ఎస్పీ శ్రీనివాసరావుతో కలిసి రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్, సభ్యులు వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్, సంత్ సేవాలాల్ మహారాజ్ చిత్రపటాలకు పూలమాలలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషన్ చైర్మన్ వెంకటయ్య మాట్లాడుతూ జిల్లాలో అట్రాసిటీ కేసులను పరిష్కరించేందుకు, బాధితులకు పరిహారం చెల్లించడం విషయంలో నిర్లక్ష్యం వహించకుండా సకాలంలో స్పందించి ముందుకెళ్లాలన్నారు. ప్రభుత్వం రూ.2 వేల కోట్ల ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను బడ్జెట్లో కేటాయించిందని, సంబంధిత వర్గాల వార్డుల్లో సీసీ రహదారులు, డ్రైనేజీలు, తదితర నిర్మించేందుకు ప్రతిపాదనలు పంపితే మంజూరు చేయడం జరుగుతుందన్నారు. గ్రామపంచాయతీలు, మునిసిపాలిటీల్లో వివిధ విభాగాల్లో విధులను నిర్వహిస్తున్న కార్మికులకు భీమా సౌకర్యం కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో కులాంతర వివాహాలు చేసుకున్న వారిని ప్రోత్సహించేందుకు, విదేశీ

> **అట్రాసిటీ కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేయాలి.**
>
> **రేపల్లె ఘటనలు పునరావృతం కాకుండా తగు చర్యలు తీసుకోవాలి.**
>
> **ప్రతి మండలంలో పౌర హక్కుల దినం నిర్వహించాలి.**
>
> **రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య.**

విద్యానిధి పథకంకు ఎప్పటికప్పుడు నిధులు సమకూరేలా ప్రభుత్వంతో మాట్లాడుతానన్నారు.. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు పదవ తరగతి ఫలితాల్లో మెరుగైన ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని, విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లోనూ అర్హులైన విద్యార్థులందరికీ ఉచిత విద్య అందేలా పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్తానన్నారు. దళితులు, గిరిజనులకు సంబంధించిన భూ సమస్యల పరిష్కారంలోనూ ప్రత్యేక శ్రద్ధ వహించాలని రెవెన్యూ అధికారులను కోరారు. రేపల్లె ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు తగు చర్యలు తీసుకోవాలన్నారు. బాధిత కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడమే కాక ఉద్యోగం, వ్యవసాయ భూమి కూడా ఇచ్చేందుకు ప్రభుత్వంతో మాట్లాడి కృషి చేస్తానన్నారు. అన్ని వర్గాల ప్రజలు కలిసిమెలిసి జీవించేలా ప్రతినెల అన్ని మండలాల్లో పౌర హక్కుల దినం నిర్వహించాల్సిందిగా జిల్లా అధికార యంత్రాంగానికి కమిషన్ చైర్మన్ ఆదేశించారు. అదేవిధంగాజిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ జిల్లాలో షెడ్యూల్డ్ కులాల, తెగల సంక్షేమానికి ప్రభుత్వం కేటాయించే నిధులను వంద శాతం ఖర్చు పెట్టేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశాలు నిర్వహిస్తున్నామని, ప్రతినెల అన్ని మండలాల్లో సివిల్ రైట్స్ డే కూడా తప్పకుండా నిర్వహించేలా చర్యలు చేపడతామన్నారు. గత ఏడాది కాలంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీకి సంబంధించి నమోదైన 53 కేసులను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని, బాధితులకు ఎక్స్‌గ్రేషియా చెల్లించడంలో సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకుంటున్నారన్నారు. అదేవిధంగా ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను పరిష్కరించేందుకు డిఎస్పీ స్థాయి అధికారులతో విచారణ చేయిస్తున్నామని, బాధితులకు న్యాయం జరిగేందుకు తమ వంతుగా కృషి చేస్తున్నామన్నారు. కేసుల సత్వర పరిష్కారానికి అవసరమైన కుల ధృవీకరణ పత్రాలు రెవిన్యూ అధికారులు ఇవ్వడమే కాక వైద్య ఆరోగ్యశాఖ అధికారులు కూడా సహకరిస్తున్నారన్నారు. నాగర్ కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ సభ్యులు మల్లు రవి పర్యవేక్షణలో కూడా తరచూ జిల్లా స్థాయి ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశాలు నిర్వహించి షెడ్యూల్డ్ కులాలు, తెగల సంక్షేమానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు.అనంతరం రేపల్లె ఘటనపై బాధిత కుటుంబానికి తగు న్యాయం చేయడమే కాక దాడికి పాల్పడిన వారిపై తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ పలు దళిత సంఘాల నేతలు కమిషన్ చైర్మన్ కు వినతిపత్రం అందజేశారు. రేపల్లె ఘటనకు సంబంధించి బాధ్యులపై కేసు నమోదు చేసినందున ప్రభుత్వం నుంచి అందే పరిహారంలో మొదటి విడతగా వచ్చిన రూ.25 వేల చెక్కును కమిషన్ చైర్మన్, కలెక్టర్, తదితరులు బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. అలాగే వివిధ సంఘాల నేతలు కమిషన్ చైర్మన్, సభ్యులను సన్మానించి పలు సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు. అంతకుముందు కమిషన్ చైర్మన్, సభ్యులు రేపల్లె గ్రామంలో బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఘటనపై విచారం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో కమిషన్ సభ్యులు రాంబాబు నాయక్, లక్ష్మీనారాయణ, ఎన్జీవో ఆర్గనైజేషన్ మెంబర్ గంధం నాగరాజు, అదనపు కలెక్టర్లు మధుమోహన్ నర్సింగరావు అదనపు ఎస్పి శంకర్ ఆర్డీవో శ్రీనివాసరావు, జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు కురుమన్న, శైలజ, మల్లికార్జున్, సురేష్ నాయక్, జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి నాగరాజు, కార్పొరేషన్ ఈవో సుదర్శన్, ఎస్టి అభివృద్ధి అధికారి యాదమ్మ, ఇతర జిల్లా అధికారులు, తహసిల్దార్లు, తదితరులు, పాల్గొన్నారు.

# సాలార్ నగర్ భూభారతి సర్వేపై రైతుల ఆగ్రహం

మొదటిపేజీ తరువాయి

## భూభారతి పైలట్ ప్రాజెక్టు.. సమస్యలకు 'సర్వే'తోనే ముగింపు? సర్వే చేశారు.. డ్రోన్ ఎగరేశారు.. ఎల్‌పీ నంబర్లు ఇచ్చారు.. కానీ రైతుల భూ సమస్యలు మాత్రం తీరలేదు! రీ-సర్వే చేసి ప్రతి సమస్యను గ్రామంలోనే పరిష్కరించాలి: సాలార్ నగర్ రైతుల డిమాండ్

గండీడ్, ప్రజా జ్యోతి:

భూముల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన భూభారతి పైలట్ ప్రాజెక్టులో భాగంగా ఎంపికైన సాలార్ నగర్ గ్రామంలో పరిస్థితి మాత్రం అందుకు భిన్నంగా ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సర్వేలు పూర్తయ్యాయని అధికారులు చెబుతున్నప్పటికీ.. తమ భూముల విషయంలో నెలకొన్న అసలు సమస్యలకు మాత్రం పరిష్కారం కనిపించడం లేదని రైతులు ప్రశ్నిస్తున్నారు. సాలార్ నగర్ గ్రామ శివారు పరిధిలో 122 సర్వే నంబర్లు, సుమారు 424 ఎకరాల భూమి ఉంది. తొలుత అధికారులు సర్వే నిర్వహించినప్పుడు పాస్‌బుక్‌లో నమోదైన విస్తీర్ణం కంటే వాస్తవ పొజిషన్‌ను ఆధారంగా తీసుకుని కొలతలు చేపట్టారని రైతులు తెలిపారు. అనంతరం పాస్‌బుక్ విస్తీర్ణం, సర్వేలో వచ్చిన పొజిషన్ వివరాలను చూపిస్తూ నోటీసులు జారీ చేసి అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని సూచించారని చెప్పారు.

రైతులు పెద్ద సంఖ్యలో అభ్యంతరాలు వ్యక్తం చేసినప్పటికీ ఆ అభ్యంతరాలపై స్పష్టమైన పరిష్కారం ఎక్కడ? అని ప్రశ్నిస్తున్నారు.

### డ్రోన్ సర్వే చేసినా.. డౌట్లు మాత్రం మిగిలాయి!

గ్రామంలో డ్రోన్ సర్వే కూడా నిర్వహించారు. రైతులు అధికారులను కలిసి తమ భూముల విషయంలో స్పష్టత కోరగా, ప్రతి రైతు సమస్య పరిష్కరించే వరకు ముందస్తు చర్యలు తీసుకోబోమని హామీ ఇచ్చినట్లు రైతులు చెబుతున్నారు. అయితే ప్రస్తుతం కొన్ని సర్వే నంబర్లకు ఎల్‌పీ నంబర్లు కేటాయించగా, మరికొన్ని సర్వే నంబర్లు ఎల్‌పీఎంలో కనిపించకపోవడంతో రైతులు అయోమయానికి గురవుతున్నారు.

ప్రత్యేకంగా 89, 91 సర్వే నంబర్లలో ఇంటర్నల్ సర్వే పూర్తిగా జరగలేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఒక సర్వే నంబర్ మొత్తం విస్తీర్ణాన్ని మాత్రమే పరిగణనలోకి తీసుకుని, అందులోని రైతుల వారీగా ఉన్న అంతర్గత భూములను పూర్తిగా గుర్తించకుండా సర్వే పూర్తయిందని భావించడం వల్ల భవిష్యత్తులో మరిన్ని వివాదాలకు దారితీసే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### పాస్‌బుక్‌లో ఒకటి.. పొజిషన్‌లో మరొకటి!

పాస్‌బుక్‌లో ఉన్న భూమి విస్తీర్ణానికి, సర్వేలో వాస్తవ పొజిషన్‌గా చూపిన విస్తీర్ణానికి మధ్య తేడాలు రావడం ప్రస్తుతం రైతులను తీవ్రంగా కలవరపెడుతున్న సమస్యగా మారింది. కొందరికి పాస్‌బుక్‌లో ఉన్నదానికంటే ఎక్కువ భూమి పొజిషన్‌లో కనిపిస్తుండగా, మరికొందరికి తక్కువగా వస్తోందని రైతులు చెబుతున్నారు.కొంతమంది రైతుల సర్వే నంబర్లు ఎల్‌పీఎంలో కనిపించకపోవడం, కొన్ని సర్వే నంబర్లలో సరైన ఎల్‌పీ నంబర్లు రాకపోవడం, మరికొన్ని చోట్ల ఇంటర్నల్ సర్వే జరగకపోవడం వంటి సమస్యలతో రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు.

### రైతులు ఆఫీసుల చుట్టూ తిరగాలా? అధికారులే గ్రామానికి రావాలా?

జీవనోపాధి కోసం హైదరాబాద్, బొంబాయి తదితర ప్రాంతాలకు వలస వెళ్లిన రైతులు కూడా తమ భూముల సమస్యల కోసం తిరిగి గ్రామానికి రావాల్సిన పరిస్థితి ఏర్పడిందని రైతులు చెబుతున్నారు. భూభారతి ప్రక్రియపై పూర్తిస్థాయి అవగాహన లేకపోవడంతో ఏ సమస్యకు ఎవరిని సంప్రదించాలో తెలియక ఇబ్బందులు పడుతున్నామని అంటున్నారు."గ్రామానికి వచ్చి సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తాం" అని చెప్పిన అధికారులు.. ఇప్పుడు రైతులను మండల కార్యాలయాల చుట్టూ ఎందుకు తిప్పుతున్నారంటూ రైతులు ప్రశ్నిస్తున్నారు. ప్రతి రైతు సమస్యను ఒక్కొక్కటిగా గుర్తించి పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని వారు పేర్కొంటున్నారు.ఇప్పుడే పరిష్కరించాలి.. లేకుంటే రేపు రైతుల మధ్య వివాదాలే!భూమి విషయంలో చిన్నపాటి తప్పిదం జరిగినా భవిష్యత్తులో అది పెద్ద వివాదానికి దారితీసే అవకాశం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రశాంతంగా ఉన్న సాలార్ నగర్ గ్రామంలో భూ సర్వే సమస్యల కారణంగా రైతుల మధ్య విభేదాలు తలెత్తకుండా అధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.భూభారతి పైలట్ ప్రాజెక్టు పేరుతో సర్వే చేసి ఫైళ్లను మూసివేయడం కాకుండా.. ప్రతి రైతు భూమిని క్షేత్రస్థాయిలో పరిశీలించి, పాస్‌బుక్, రెవెన్యూ రికార్డులు, వాస్తవ పొజిషన్, సర్వే నంబర్, ఎల్‌పీ నంబర్లను సమగ్రంగా సరిపోల్చాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు."ఒక్కసారి గ్రామానికి రండి.. మా సమస్యలు వినండి"అధికారులు ప్రత్యేక బృందాన్ని సాలార్ నగర్ గ్రామానికి పంపించి రైతులందరి నుంచి సమస్యలను నేరుగా స్వీకరించి, అవసరమైన చోట రీ-సర్వే నిర్వహించి, పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.భూమి రైతుకు జీవనాధారం.. రికార్డుల్లో తప్పు రైతు భవిష్యత్తుపై ప్రభావం చూపకముందే భూభారతి పైలట్ ప్రాజెక్టు లక్ష్యానికి అనుగుణంగా సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని సాలార్ నగర్ రైతులు కోరుతున్నారు.